సాక్షి
రంగారెడ్డి
బుధవారం ‌। 26 ‌। జూన్ ‌। 2024



అరెస్ట్‌కు డిమాండ్

దళిత బాలుడిని కట్టేసి కొట్టిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని ఆయా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. 8లో

న్యూస్‌రీల్

జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్



మాట్లాడుతున్న బంజారా నాయకులు

షాద్‌నగర్‌రూరల్: గోరు బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మా తండాలో మా రాజ్యం'.. తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో, గిరిజన ధామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలనే నినాదంతో వచ్చే నెల 1న హైదరాబాద్‌లో గోరు బంజారా జాతీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తండాల్లోని గిరిజనులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారని, తండాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గోరు బంజారా సమ్మేళనానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్లయ్య నాయక్‌తో పాటు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, గోవా, పంజాబ్, ఢిల్లీ, హర్యానా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి గోరు బంజారా నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రాంబల్ నాయక్, మిట్టు నాయక్, రాజు నాయక్, లక్ష్మణ్ నాయక్, రూప్లా నాయక్, రాజు నాయక్, బాలు నాయక్, చందు నాయక్, శంకర్‌నాయక్, కుమార్ నాయక్, సంతోష్ నాయక్, వినోద్ నాయక్, జగన్ నాయక్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్



మొక్కలు పంపిణీ చేస్తున్న లక్ష్మీనివాస్

షాద్‌నగర్‌రూరల్: మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనివాస్ మాట్లాడుతూ.. మానవ మనుగడకు చెట్లే ప్రాణాధారమని అన్నారు. చెట్లను నరికివేస్తే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. వాతావరణ కాలుష్యంతో మానవ జీవన ప్రమాణం ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యాన్ని తరిమికొట్టాలంటే ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, సుదర్శన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిలు రద్దు చేయండి

మంత్రి తుమ్మలకు పౌల్ట్రీ రైతుల విజ్ఞప్తి



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన పౌల్ట్రీ రైతులు

షాద్‌నగర్: పౌల్ట్రీ పరిశ్రమకు ఆస్తిపన్ను బకాయి రద్దు చేయాలని కోరుతూ పౌల్ట్రీ రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు షాద్‌నగర్‌కు చెందిన పలువురు పౌల్ట్రీ రైతులు మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. గతంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పౌల్ట్రీలపై ఆస్తి పన్ను వేసిన దాఖలాలు లేవని తెలిపారు. కేవలం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పౌల్ట్రీలపై మాత్రమే ఆస్తి పన్ను విధించారని, వాటిని రద్దు చేయాలని కోరారు. మున్సిపల్ చట్టం ప్రకారం పౌల్ట్రీని ఒక యూనిట్‌గా చేసి కేవలం వంద రూపాయలు మాత్రమే మెయింటనెన్స్ కింద వసూలు చేయాలని, కానీ అధికారులు మాత్రం పెద్ద మొత్తంలో పన్నులు వేశారని మంత్రి దృష్టికి తెచ్చారు. పన్నులను రద్దు చేసి పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో పౌల్ట్రీ రైతులు రామారావు, వెంకట నారాయణ, శ్రీనివాసరావు, అర్జున్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, మల్లికార్జునరావు, బండారు సతీష్, శరత్, మధు, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

పచ్చటి చెట్లపై గొడ్డలి వేటు

వీళ్లు నాటుడు.. వాళ్లు నరుకుడు

- హరితహారంలో భాగంగా రోడ్లకిరువైపులా మొక్కల పెంపకం
- కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్నాయని విద్యుత్ శాఖ నరికివేత
- కోట్ల రూపాయల ప్రజాధనం వృథా



గునుగల్ గ్రామ సమీపంలో నరికేసిన చెట్టు

యాచారం: పచ్చటి చెట్లపై గొడ్డలివేటు పడుతోంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం పేరుతో పెరిగే చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ ఎక్కడికక్కడ నరికేస్తోంది. ప్రభుత్వాలు గొప్ప లక్ష్యంతో హరితహారం పథకం కింద ఈజీఎస్ నిధులతో ఏటా జిల్లాలో కోట్లాది మొక్కలను నాటుతూ సంరక్షిస్తోంది. ఉపాధి కూలీలు చంటిపిల్లల మాదిరిగా మొక్కలను పెంచి పెద్ద చేస్తే విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా నరికేస్తుండడంతో హరితహారం లక్ష్యానికి గండి పడుతోంది. పర్యావరణ పరిరక్షణతోపాటు చెట్లుంటునే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే ఉద్దేశంతో ప్రభుత్వాలు హరితహారం పథకాన్ని చాలెంజ్‌గా తీసుకుంటున్నాయి. ప్రతి గ్రామంలో నర్సరీని ఏర్పాటు చేసి 18 వేలకు పైగా మొక్కలను పెంచి అదే గ్రామంలో నాటేలా అధికారులు నిర్ణయించారు. జిల్లాలో ఏటా హరితహారం పథకానికి రూ.35 కోట్లకు పైనే ఈజీఎస్ నిధులను ఖర్చు చేస్తున్నారు. నర్సరీలో మొక్కలు పెరగక పోయినా.. నాటిన తర్వాత చెట్లు ఎండినా ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని 558 గ్రామాల్లో ఐదేళ్లలో హరితహారం పథకం కింద 4 కోట్లకు పైగా మొక్కలు నాటారు.

ప్రతి మొక్కపై రూ.600కు పైగా ఖర్చు

గుంతలు తీసి, మొక్కలు నాటిన తర్వాత రెండేళ్ల పాటు సంరక్షణకు ఈజీఎస్ నిధులనే ఖర్చు చేస్తారు. ఇలా నర్సరీల్లో మొక్కలు పెంచడం, గుంతలు తీసి రెండేళ్ల పాటు మొక్కలను ఉపాధి కూలీల ద్వారా సంరక్షణ చేయించినందుకు గాను రూ.600 నుంచి రూ. వెయ్యి వరకు వెచ్చిస్తున్నారు. ఏటా లక్షలాది మొక్కలకు గాను రూ. కోట్లాది నిధులను ఖర్చు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, కల్వకుర్తి, షాద్‌నగర్, మహేశ్వరం తదితర నియోజకవర్గాల్లో ఏటా లక్షలాది మొక్కలు నాటుతున్నారు. ఈజీఎస్ పథకం నుంచి నిధులు మంజూరు చేస్తే పంచాయతీల పర్యవేక్షణలో మొక్కల పెంపకం నిర్వహణ ఉంటుంది. మొక్కలు పెరిగి పెద్దవైతే ప్రయాణికులు సేద తీర్చుకోవడంతోపాటు ఆహ్లాదకరంగా ఉంటుందనే ఉద్దేశంతో ఆయా గ్రామాల్లో అధిక శాతం రోడ్ల కిరువైపులా నాటారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగర కలాన్ నుంచి కలెక్టరేట్ చౌరస్తా వరకు ఐదేళ్ల క్రితం నాటిన మొక్కలను విద్యుత్ అధికారులు కట్ చేయించారు.



వైర్లు తగిలితే నరకడమే..

విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగిలితే నరికేయడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ చర్యలకు ఉపక్రమించింది. మహానగరం నుంచి నాగార్జునసాగర్, శ్రీశైలం, విజయవాడ రహదారుల్లో, వికారాబాద్ వెళ్లే రోడ్డు కిరువైపులా లక్షలాదిగా మొక్కలు నాటారు. ఐదేళ్ల క్రితం నాటిన మొక్కలు ప్రస్తుతం పెద్దపెద్ద వృక్షాలుగా ఎదిగాయి. రహదారు వెంట రోడ్డుకిరువైపులా నాలుగు వరసల మొక్కలు నాటారు. ఇంత వరకు బాగానే ఉన్నా పైన విద్యుత్ వైర్లు ఉండడం.. మొక్కలు ఎదిగితే విద్యుత్ శాఖ అధికారులు నరికేస్తారని తెలిసినప్పటికీ పట్టించుకోకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోంది. మండల కేంద్రాల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్ల వెంట కూడా విరివిగా మొక్కలు నాటారు. మండల కేంద్రాల్లోని సబ్ స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా కోసం స్తంభాలను రోడ్ల వెంటనే పాతి వైర్లను లాగారు. విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటడం, అవి ప్రస్తుతం పెద్దవిగా కావడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందనే నెపంతో కొమ్మలను నరికేస్తున్నారు. జిల్లాలో పలు మండలాల్లో కొద్ది రోజులుగా స్పెషల్‌డ్రైవ్ కింద విద్యుత్ శాఖ రోడ్ల వెంట చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తాకుతున్నాయని నరికేస్తోంది.

అంతరాయం కలగకుండా..



ఆయా గ్రామాల్లోని రోడ్ల వెంట ఉన్న విద్యుత్ స్తంభాల వైర్లకు చెట్ల కొమ్మలు తగలడంతో సరఫరాలో అంతరాయం కలుగుతోంది. ఈదురుగాలులు, వర్షాలు కురిస్తే చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ లైన్‌లో ఉన్న వైర్లపై పడిపోతున్నాయి. దీంతో గ్రామాల్లో సరఫరా నిలిచిపోతోంది. రాత్రిపూట సరఫరా నిలిచిపోతే ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందుకే విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్లను, కొమ్మలను నరికేస్తున్నాం.

– సైదులు, ట్రాన్స్‌కో ఏడీఈ, ఇబ్రహీంపట్నం డివిజన్



ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో..



మత్తుపై ధ్వజమెత్తారు



యువతను బలి తీసుకుంటున్న మాదకద్రవ్యాల నిరోధానికి కలిసికట్టుగా ఉద్యమించాలి. తెలిసీ తెలియని వయసులో మత్తుకు బానిసలుగా మారొద్దు. డ్రగ్స్ నిరోధానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నెక్లెస్ రోడ్డులో మంగళవారం యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో చేపట్టిన డ్రగ్స్ నిర్మూలన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 'డ్రగ్స్ ఆర్ నో బాల్స్.. ఇన్ ద గేమ్ ఆఫ్ లైఫ్' అంటూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు.



కొత్త భవనం నిర్మించాల్సిందే

జూనియర్ డాక్టర్ల సంఘం ప్రతినిధులు



ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవనం నిర్మించేంత వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని జూనియర్ డాక్టర్ల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు జూనియర్ డాక్టర్ల సమ్మెలో భాగంగా 2వ రోజు మంగళవారం జూడాలు ఉస్మానియా ఆస్పత్రిలో ప్లకార్డులతో ఓపీ నుంచి కులీ కుతుబ్‌షాహి భవనం, సూపరింటెండెంట్ కార్యాలయం, పాత భవనం చుట్టూ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి రావాలి, ఉస్మానియాకు నూతన భవనం నిర్మించాలి, మాకు న్యాయం చేయాలి, మమల్ని మీరు బతికించండి, మిమల్ని మేము బతికించుకుంటామంటూ భారీ ఎత్తున నినాదాలు చేశారు. నూతన హైకోర్టు నిర్మాణం కోసం రాజేంద్రనగర్‌లో 100 ఎకరాల స్థలం కేటాయించిన ముఖ్యమంత్రి వేలాది మంది పేద రోగులు చికిత్సలు పొందే ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో ఉండే తమకు సీఆర్‌పీఎఫ్ పోలీసుల భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయపరమైన 8 డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదన్నారు.

మహా దృష్టితో..



విపత్తు నిర్వహణ.. ఆస్తుల పరిరక్షణ!

- 'గ్రేటర్'లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం
- జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏల్లోని విభాగాలతో రూపకల్పన
- కమిషనర్‌గా ఐజీ స్థాయి అధికారి ఏవీ రంగనాథ్ నియామకం
- ఇద్దరు ఎస్పీలు, నలుగురు డీఎస్పీలతో పాటు భారీ సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంపై ప్రత్యేక దృష్టి పెట్టిన సర్కారు పాలనా పరంగా కీలక సంస్కరణలు తెస్తోంది. వీటిలో భాగంగా ప్రభుత్వ స్థలాలు, నాలాలు, చెరువుల కబ్జాల నిరోధం, విపత్తు స్పందన కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తోంది. పోలీసు విభాగానికి చెందిన అధికారుల నేతృత్వంలో అసెట్స్ ప్రొటెక్షన్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పేరుతో దీనికి రూపం ఇస్తోంది. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏల్లో ఉన్న నిఘా, పర్యవేక్షణ బృందాలు దీని పరిధిలోకి తీసుకురానున్నారు. ఐజీ హోదాలో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను కమిషనర్‌గా వ్యవహరిస్తారు. జీహెచ్‌ఎంసీలో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్‌గా సోమవారం ఆయన నియమితులయ్యారు. కొత్త విభాగం ఏర్పాటు పూర్తయిన తర్వాత దానికి కమిషనర్‌గా మారుతారు.

ఏకరూప స్పందన కోసం..

ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధీనంలో పని చేసే ఈ కొత్త విభాగం బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీఎస్ ఐసీసీసీ) కేంద్రంగా పని చేస్తుంది. ఇది అమలులోకి వస్తే ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఎండీఏలోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు ఇందులో విలీనం కానున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) లోపల ఉన్న ప్రాంతంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఏకరూప స్పందన ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు.

– ప్రస్తుతం ఉన్న భిన్న వ్యవస్థలతో వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు, భారీ అగ్ని ప్రమాదాలు వంటివి చోటు చేసుకున్నప్పుడు ఇది సాధ్యం కావట్లేదు. జీహెచ్‌ఎంసీ పరిధిలో దీనికోసం డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) ఉండగా.. ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇలాంటి విభాగాలు లేకపోవడంతో సహాయ కార్యక్రమాలకు ఆలస్యమవుతోంది. ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ గేట్ల వద్ద వరద నీరు వచ్చినప్పుడు ఈ ఇబ్బంది కనిపిస్తోంది. మరోపక్క నగరంలోని అనేక ఖరీదైన ప్రభుత్వ స్థలాలు కైంకర్యం అవుతున్నాయి. చెరువులు, నాలాలు కబ్జాలతో నిండిపోతున్నాయి. ఈ ప్రభావం నగరవాసులపై తీవ్రంగా ఉంటోంది. దీంతో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం వేర్వేరుగా విభాగాలు పని చేస్తుండటంతో సమన్వయ లోపం ఏర్పడుతోంది.

కబ్జాదారులపై ఉక్కుపాదం మోపాలనే..

- ఈ పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం అసెట్స్ ప్రొటెక్షన్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని తీసుకువస్తోంది. ఇందులో కమిషనర్‌తో పాటు ఇద్దరు ఎస్పీ స్థాయి అధికారులు, నలుగురు డీఎస్పీలను డిప్యుటేషన్‌పై తీసుకుంటారు. కబ్జాదారులపై కఠినంగా వ్యవహరించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకుంది.
- ఈ వింగ్‌కు నిఘా, పర్యవేక్షణలతో పాటు కొన్ని ప్రత్యేక అధికారాలను సైతం ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఎస్పీగా, వరంగల్ పోలీసు కమిషనర్‌గా పని చేసిన ఏవీ రంగనాథ్ ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈనేపథ్యంలోనే ఈ విభాగం తొలి కమిషనర్‌గా అవకాశం ఇచ్చింది.

'రైతు భరోసా' ఎలా కల్పిద్దాం?

రైతుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- అభిప్రాయాలు సేకరించిన జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



మొయినాబాద్‌లోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయాధికారులు, చేవెళ్ల డివిజన్ రైతులు

మొయినాబాద్: ప్రభుత్వం రైతు భరోసా పథకంపై సేకరిస్తున్న ప్రజాభిప్రాయసేకరణలో రైతులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. వ్యవసాయశాఖ ఆదేశాల మేరకు రైతులకు వానాకాలం పంటలసాగుపై అవగాహన కల్పించేందుకు మంగళవారం మండలకేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పాల్గొని ఆయా జిల్లాల వారీగా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు దారెడ్డి సుధాకర్‌రెడ్డి తన అభిప్రాయాన్ని మంత్రికి తెలియపరిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాల వారీగా అందరి అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందరితో మాట్లాడే వీలుపడనందున రైతులు వారి అభిప్రాయాలను కాగితంపై రాసి వ్యవసాయాధికారులకు అందజేయాలని సూచించారు. అక్కడే ఉన్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటల సాగుకు ముందే రైతు భరోసా అందించాలని చాలామంది అభిప్రాయం వ్యక్తం చేశారని చెప్పారు. వారి అభిప్రాయాలను రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులకు అందజేయనున్నట్లు వెల్లడించారు.

వానాకాలం పంటలసాగుపై అవగాహన

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించటం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి తెలిపారు. వ్యవసాయశాఖ ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం రైతువేదికల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈ వారం మొయినాబాద్ రైతు వేదికలో వానాకాలంలో వివిధ పంటల సాగు విధానం, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ అధికారుల వీడియోలను రైతులకు చూపించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయాధికారులు, టెక్నికల్ వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు, డివిజన్‌లోని రైతులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయలు ఇలా ఉన్నాయి..

- సాగు చేసే ప్రతి రైతుకు, ప్రతి ఎకరానికి ఇవ్వాలి.
- కౌలు రైతులకు కూడా రైతు భరోసా కల్పించాలి.
- ప్రతి రైతు బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు ఐటీ కట్టాల్సి వస్తోంది. ఐటీతో సంబంధం లేకుండా ఇవ్వాలి.
- రైతు రుణమాఫీకి ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలి.
- ఎకరం నుంచి పది ఎకరాల వరకు ఉన్న రైతులకు అమలు చేయాలి.
- అమ్ముకున్న భూములు, వెంచర్లు, కొండలు, రోడ్లకు రైతు భరోసా ఇవ్వొద్దు.
- ప్రభుత్వ ఉద్యోగాలున్న వారికి ఇవ్వొద్దు.
- రైతు బీమా సౌకర్యం కల్పించి ఆరోగ్య కార్డులు అందించాలి.
- రైతు భరోసాతోపాటు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించాలి.
- ప్రభుత్వం ప్రకటించినట్లుగా వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాలి. అన్నిరకాలకు ఇవ్వాలి.

28 నుంచి 'బ్యాటిల్ గ్రౌండ్స్' గ్రాండ్ ఫినాలే

ఆన్‌లైన్ గేమర్స్‌ను వరించనున్న 2 కోట్ల ప్రైజ్ మనీ

సాక్షి, సిటీబ్యూరో: భారత్‌లో ప్రతిష్టాత్మకమైన 'బ్యాటిల్ గ్రౌండ్స్ మొబైల్ ఇండియా సిరీస్ 2024'(బీజీఐఎస్) గ్రాండ్ ఫినాలేకు నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. క్రాఫ్టన్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా గ్రాండ్ ఫినాలే ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనుంది. దేశంలోనే అతిపెద్దదైన ఈ రాయల్ ఎస్పోర్ట్స్ ఇండియా సిరీస్ టోర్నమెంట్‌లో 2 కోట్ల ప్రైజ్ మనీ అందించడం విశేషం. దేశంలోని యువ ఆటగాళ్లతో కూడిన చివరి 16 అగ్రశ్రేణి జట్లు చాంపియన్‌షిప్ టైటిల్‌ను దక్కించుకోవడానికి ఆన్‌లైన్ రౌండ్‌లలో పోటీ పడనున్నారు. గేమింగ్ ఔత్సాహికులు ఈ సీరీస్‌ను ప్రత్యక్షంగానే కాకుండా క్రాఫ్టన్ ఇండియా ఈ–స్పోర్ట్స్ యూట్యూబ్ ఛానెల్‌లో వీక్షించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఔటర్‌కు ఆకుపచ్చ కోక!

- రూ.30 కోట్లతో పచ్చదనం విస్తరణకు హెచ్‌ఎండీఏ చర్యలు
- ప్రైవేట్ సంస్థల నుంచి త్వరలో బిడ్‌ల ఆహ్వానం
- 1వ తేదీ నుంచి మొక్కలు నాటే కార్యక్రమం

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్‌రింగ్ రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం విస్తరణకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. 158 కిలో మీటర్ల మేర సెంట్రల్ మీడియన్, ఇంటర్ చేంజ్‌లు, రోటరీలు, కారిడార్‌లు, తదితర చోట్ల పెద్ద ఎత్తున మొక్కలు నాటనున్నారు. ఇందుకోసం సుమారు రూ.30 కోట్ల వరకు ఖర్చు కానున్నట్లు అంచనా. ఈ మేరకు పచ్చదనం విస్తరణ, అభివృద్ధి కోసం ప్రైవేట్ సంస్థల నుంచి టెండర్‌లను ఆహ్వానించేందుకు హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ విభాగం కార్యాచరణ చేపట్టింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. బిడ్డింగ్‌లో అర్హత సాధించిన సంస్థలు మొత్తం 158 కి.మీ ఔటర్ మార్గంలో సెంట్రల్ మీడియన్, ఇంటర్ చేంజ్‌లు, కారిడార్‌లు తదితర అన్ని ప్రాంతాల్లో 1500 కి.మీ వరకు మొక్కలను నాటి పెంచాల్సి ఉంటుంది. ఔటర్‌పై రాకపోకలు సాగించే వాహనదారులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందజేసేందుకు హెచ్‌ఎండీఏ పెద్ద ఎత్తున పచ్చదనాన్ని అభివృద్ధి చేసింది. గత ప్రభుత్వ హయాంలోనే ఔటర్‌రింగ్ రోడ్డును 30 ఏళ్లకు ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టినప్పటికీ పచ్చదనం పరిరక్షణ బాధ్యత మాత్రం హెచ్‌ఎండీఏ నిర్వహణలోనే ఉంది. ఈ మేరకు పనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు అధికారులు త్వరలో టెండర్లను ఆహ్వానించనున్నారు.


అందం.. ఆహ్లాదం..

- ఔటర్ రింగ్‌రోడ్డు మార్గంతో పాటు నగరానికి అన్ని వైపులా ఉన్న ప్రధాన రహదారి మార్గాల్లోనూ హెచ్‌ఎండీఏ గతంలో పెద్ద ఎత్తున పచ్చదనం విస్తరణ, అభివృద్ధికి చర్యలు చేపట్టింది. నగర శివారు ప్రాంతాలను ఆనుకొని ఉన్న పట్టణ అడవుల్లో కొంత భాగాన్ని ఉద్యానాలుగా అభివృద్ధి చేశారు. మొదట 59 అర్బన్ ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. గత ఏడాది 39 పార్కులు వినియోగంలోకి వచ్చాయి. మరో 20 వివిధ దశల్లో ఉన్నాయి. అప్పట్లో హెచ్‌ఎండీఏ చేపట్టిన చర్యలతో నగరంలో ఫారెస్ట్ కవర్ 33.15 చదరపు కిలో మీటర్ల నుంచి 81.81 చదరపు కిలో మీటర్లకు పెరిగినట్లు అంచనా. అర్బన్ ఫారెస్ట్ పార్కులకు వరల్డ్ ఫారెస్ట్ సైన్స్ నుంచి కూడా సముచితమైన గుర్తింపు లభించింది.
- మరోవైపు నగరానికి గ్రీన్‌సిటీ అవార్డు కూడా లభించింది. పచ్చదనంలో నగరం సాధించిన అభివృద్ధిని కాపాడేందుకు హెచ్‌ఎండీఏ తాజాగా దృష్టి సారించింది. ప్రతి రోజు సుమారు 1.50 లక్షల వాహనాలు ఔటర్‌పై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో వాహన కాలుష్యం బారిన పడకుండా ఔటర్ మార్గాన్ని పచ్చదనంతో పరిరక్షించాలని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు పచ్చదనం వల్ల వాహనదారులకు ఆహ్లాదకరమైన అనుభూతి లభించనుంది. ఈ పచ్చదనం విస్తరణలో భాగంగా ఔటర్‌కు ఇరువైపులా, మధ్యలో రంగురంగుల పూల మొక్కలను నాటనున్నారు. టికోనా, అర్జెంటీయా, బోగన్‌విలియా, పాగోడి, నందివర్ధనాలు, తదితర 11 రకాల మొక్కలను నాటనున్నట్లు అధికారులు తెలిపారు.

సొమ్మొకరిది.. సోకొకరిది..

ఔటర్ రింగ్‌రోడ్డును ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థకు లీజుకు ఇవ్వడానికి ముందే హెచ్‌ఎండీఏ పచ్చదనం అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంది. మొత్తం 62 బ్లాకులుగా విభజించి 63.13 లక్షలకు పైగా మొక్కలను నాటారు. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ద్వారా ప్రతి మొక్కకు నీటిని అందజేశారు. ఇందుకోసం సుమారు రూ.17 కోట్లతో బోర్‌వెల్‌లు వేశారు. పంపుసెట్లు కొనుగోలు చేశారు. కానీ ఔటర్‌ను లీజుకు ఇచ్చే క్రమంలో పచ్చదనం పరిరక్షణను లీజులో భాగంగా కాకుండా హెచ్‌ఎండీఏ నిర్వహణలోనే ఉంచారు. ప్రస్తుతం ఔటర్ పైన లీజు ద్వారా ఐఆర్‌బీకి ప్రతి నెలా సుమారు రూ.60 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుంది. కానీ రూ.కోట్లు ఖర్చు చేసి ఔటర్‌కు సొగసులు అద్దాల్సిన బాధ్యత మాత్రం హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉండడం గమనార్హం.


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న వివిధ కులసంఘాల నాయకులు

మధుసూదన్‌రెడ్డి అరెస్ట్‌కు డిమాండ్

జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన

షాబాద్: దళిత మైనర్ బాలుడిని కొట్టిన మధుసూదన్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు బేగరి రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వారు మండల కేంద్రంలోని ముంబాయి–బెంగుళూరు లింక్ జాతీయ రహదారిపై యువజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. మధుసూదన్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఒక పండు తెంచినందుకు బాలుడు బేగరి యాదగిరిపై విచక్షణా రహితంగా దాడి చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనతో హైవేపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న షాబాద్ సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి అక్కడకు చేరకుని నిందితుడిని అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం మండల పరిధిలోని కేసారం గ్రామంలో బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విశ్వంమాదిగ, సీపీఎం నియోజకవర్గ అధ్యక్షుడు దేవేందర్, అంబేడ్కర్ సంఘాల నాయకులు మల్లేశ్, యాదగిరి, ప్రభాకర్, శ్రీశైలం, శ్రీను, రాంచందర్, చందు, నవీన్, నర్సింహ, రాజు, బందీశ్వర్, మహేందర్ తదితరులున్నారు.

తల్లితో వివాహేతర సంబంధం.. కూతుళ్లపై కన్ను

- యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్ట్.. మూడిళ్లలో విషాదం

చాంద్రాయణగుట్ట: తల్లితో వివాహేతర సంబంధం కొనసాగించడమే కాకుండా ఇద్దరు కూతుళ్లపై కన్నేయడంతోనే యువకుడి హత్యాఘటన చోటుచేసుకుందని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఫలక్‌నుమా ఏసీపీ బి.యాదగిరి స్వామి, ఇన్‌స్పెక్టర్ కె.ఆదిరెడ్డితో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. రాజేంద్రనగర్ హసన్‌నగర్‌కు చెందిన డ్రైవర్ జాకీర్ అలీ(29) కుటుంబానికి సంబంధించిన స్థలాన్ని ఐదేళ్ల క్రితం ఫలక్‌నుమా అచ్చిరెడ్డినగర్‌కు చెందిన షాహిన్‌బేగం(38) కొనుగోలు చేసింది. వీరి పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. షాహిన్‌బేగంకు భర్త హాజీ పాషా, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అయితే కొన్ని నెలల నుంచి జాకీర్ అలీ కన్ను షాహిన్ బేగం పెద్ద కూతురు, రెండో కూతురుపై పడింది. తన కూతుళ్లపట్ల అసభ్యంగా ప్రవర్తించవద్దని చెప్పినా వినకపోవడంతో విషయాన్ని ఆమె తన భర్తకు, తమ్ముడు మహ్మద్ షఫీ(31)కి తెలిపింది. ఈ క్రమంలో ఈ నెల 21న రాత్రి షాహీన్ బేగం ఇంటికి వచ్చిన జాకీర్‌పై షఫీ ఐరన్ రాడ్‌తో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు హాజీ, షఫీలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, షాహిన్‌బేగం పరారీలో ఉంది. ఒక్కగానొక్క కొడుకు జాకీర్ హత్యతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మరోవైపు షాహీన్ బేగం, హాజీ దంపతులపై కేసులతో ఐదుగురు పిల్లలు ఒంటరయ్యారు. షఫీ జైలుకెళ్లడంతో అతని భార్య, పిల్లలు కూడా ఆగం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కెమెరా కన్ను.. ఫెన్సింగ్ దన్ను

- హెచ్‌ఎండీఏ భూముల పరిరక్షణకు చర్యలు
- రూ.4.10 కోట్లతో మియాపూర్ భూముల రక్షణ
- అన్ని చోట్ల డిజిటల్ సర్వే, సెక్యూరిటీ పెంపు
- వివిధ ప్రాంతాల్లో 1,900 ఎకరాలకుపైగా భూముల గుర్తింపు



సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ భూముల పరిరక్షణకు నడుంబిగించింది. మియాపూర్ భూముల కబ్జా ఉదంతం నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న హెచ్‌ఎండీఏ భూములపై నిఘా పెంచింది. డిజిటల్ సర్వే చేసి జియో ఫెన్సింగ్ ద్వారా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయనుంది. అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయంతోపాటు, పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం, జిల్లా కలెక్టర్ కార్యాలయాలతో అధికారులు అనుసంధానం చేయనున్నారు. జియోఫెన్సింగ్‌కు అవకాశం లేని చోట సెక్యూరిటీ సిబ్బందిని పెంచి 24 గంటలపాటు పహారా ఏర్పాటు చేయనున్నారు. ఈ దిశగా ఇప్పటికే ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా డిజిటల్ సర్వే చేపట్టినట్లు హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. త్వరలోక్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి సీసీ కెమెరాలు, జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో మొత్తం 368 చిన్నవి, మరో 25 పెద్ద పార్సిళ్లు ఉన్నాయి. ఇప్పటికే పలుచోట్ల విలువైన భూములు కబ్జాకు గురైపోగా అన్నిచోట్ల కలిపి 1,900 ఎకరాలకుపైగా భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మియాపూర్‌తోపాటు, గాజుల రామారం వంటి శివారు ప్రాంతాల్లో భూములు కబ్జాకు గురవుతున్నాయి. గతంలో శంషాబాద్‌లోనూ ప్రైవేట్ వ్యక్తులు ఇదే తరహాలో ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. అధికారులు ఆలస్యంగా మేల్కొని అక్రమ నిర్మాణాలను కూల్చివేసి రక్షణ చర్యలు చేపట్టారు. మరోసారి మియాపూర్‌లోనూ అదే తరహాలో భూముల కబ్జా పర్వం చోటుచేసుకోవడంతో యంత్రాంగం రంగంలోకి దిగింది. మియాపూర్‌తోపాటు అన్నిచోట్ల భుములను కాపాడేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

మియాపూర్‌లో ఫెన్సింగ్

మియాపూర్‌లో హెచ్‌ఎండీఏకు 455 ఎకరాల భూమి ఉంది. ఇటీవల ఈ భూముల ఆక్రమణకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవడంతో పాటు పెద్ద ఎత్తున పోలీసు భద్రత ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ భూముల రక్షణపైనే అధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. ఇందుకోసం సుమారు రూ.4.10 కోట్లతో చుట్టూ 8 కిలోమీటర్‌ల మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేసి 50 చోట్ల సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఈ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌తోపాటు కలెక్టరేట్, హెచ్‌ఎండీఏ కార్యాలయాలకు అనుసంధానం చేస్తారు. సెక్యూరిటీ సిబ్బందిని కూడా పెంచనున్నారు. ఆ తరువాత మరో 25 పెద్ద పార్సిళ్లలో భూముల రక్షణ చర్యలు చేపట్టనున్నారు. 'భూముల డిజిటల్ సర్వే కూడా వేగంగా కొనసాగుతోంది. త్వరలో క్షేత్రస్థాయి తనిఖీలు చేసి ఎడ్జ్‌లు, రిడ్జ్‌లు వంటివి గుర్తించి జియో ఫెన్సింగ్ చేస్తాం'అని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

తండ్రీకొడుకుల అదృశ్యం


నాగరాజు(ఫైల్)


రితీశ్(ఫైల్)

మీర్‌పేట: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తండ్రీకొడుకులు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌కు చెందిన నాగరాజు (32) ఈ నెల 22న కుమారుడు రితీశ్‌ను వెంటబెట్టుకుని రాత్రి 10 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. తిరిగి వారు రాకపోవడంతో నాగరాజు భార్య శిరీష పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

15 తులాల వెండి, రూ.పది వేల నగదు మాయం

శంకర్‌పల్లి: తాళం వేసిన ఇంటికి కన్నమేసిన దుండగులు వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహాలింగపురం గ్రామానికి చెందిన నారాయణ, సత్యమ్మ దంపతులు వారం క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. అదే ఇంట్లో పై పోర్షన్‌లో ఉండే వారి కుమారుడు రవి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు ఇంటికి వచ్చి పరిశీలించి భూమి పాస్‌పుస్తకాలు, 15 తులాల వెండి, రూ.10వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. ఈ ఘటనపై వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలు బెడద తీవ్రమవుతోంది. రోడ్ల వెంట నడుచుకుంటూ వెళ్లే వారితో పాటుగా.. ఇంటి ఎదుట ఆడుకుంటున్న చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. మంగళవారం తొమ్మిదేళ్ల బాలుడు పట్నం రుషి దుకాణానానికి వచ్చి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా వీధికుక్కలు దాడి చేయడంతో తొడ భాగంలో గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వీధి కుక్కలు దాడులు పెరిగిపోతున్నా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

11 మంది బైండోవర్


పోలీసుల అదుపులో వెంకటేశ్

ఆమనగల్లు: ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి బైక్‌ను సీజ్ చేశారు. ఈ ఘటన మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్ మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, తండాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం చారకొండ నుంచి బైక్‌పై మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్‌ను తనిఖీ చేయగా అతనివద్ద 6 లీటర్ల నాటు సారా లభ్యమైందన్నారు. దీంతో నాటుసారా, బైక్‌ను సీజ్ చేసి వెంకటేశ్‌ను అరెస్టు చేశామన్నారు. నాటుసారా కేసుల్లో నిందితులుగా ఉన్న 11 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. మాడ్గుల తహసీల్దార్ వద్ద ఐదుగురిని, తలకొండపల్లి తహసీల్దార్ వద్ద ఒకరిని, కడ్తాల తహసీల్దార్ వద్ద ఐదుగురిని బైండోవర్ చేశామన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు


కొత్త దుస్తులు వేసి వివరాలు రాబట్టేందుకు యత్నిస్తున్న పెట్రోలింగ్ సిబ్బంది

చేవెళ్ల: మతిస్థిమితం లేని ఓ మహిలను పెట్రోలింగ్ పోలీసులు చేరదీశారు. ఈ ఘటన చేవెళ్ల మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. చేవెళ్ల ప్రధాన చౌరస్తాలో గుర్తు తెలియని మహిళ మతిస్థితిమితం కోల్పోయి కనిపించింది. అటుగా వెళ్తున్న పెట్రోలింగ్ వాహనం వెళ్తున్న సమయంలో కానిస్టేబుల్ మంజుల, అశోక్‌చ డ్రైవర్ జావేద్ గమనించి ఆమె వద్దకు వెళ్లారు. తెలుగులోనే మాట్లాడుతున్నప్పటికీ ఎటువంటి వివరాలు లభించలేదు. ఆమె దుస్తులు సరిగా లేపకోవడంతో పోలీస్ సిబ్బంది కొత్త బట్టలు తెచ్చి మహిళా కానిస్టేబుల్‌తో వేయించారు. దీంతో స్థానికులు వారిని అభినందించారు. అనథాశ్రమానికి తరలించాలని పలువురు కోరగా.. తమ ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామని పోలీసులు తెలిపారు.

హెచ్‌ఎండీఏ అభివృద్ధి పనులపై ఆరా

ఇంజనీరింగ్ విభాగంపై కొత్త కమిషనర్ సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: అభివృద్ధి పనులపై హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సర్ఫరాజ్ అహ్మద్ దృష్టి సారించారు. ఈ మేరకు మంగళవారం ఇంజనీరింగ్ విభాగంపైన సమీక్ష నిర్వహించారు. అధికారులతో సమావేశమై పలు అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌తోపాటు, మీరాలం చెరువుపై నిర్మించనున్న వంతెన పనుల పురోగతిని గురించి అధికారులతో మాట్లాడారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు జంక్షన్ వరకు సుమారు రూ.2,232 కోట్ల అంచనాలతో 18.10 కిలోమీటర్‌ల మేర చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందే శంకుస్థాపన చేసింది. ఈ ప్రాజెక్టు కోసం వివిధ చోట్ల 197 ఎకరాలకుపైగా భూములను సేకరించవలసి ఉంటుంది. ఇందులో రక్షణశాఖ చెందిన భూములే 113 ఎకరాల వరకు ఉంటాయి. తొలగించవలసిన కట్టడాలు, సేకరించవలసిన భూములపై కూడా క్షేత్రస్థాయి సర్వేలు పూర్తయ్యాయి.

కొనసాగుతున్న జూడాల సమ్మె

గాంధీఆస్పత్రి:న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జూడాలు చేపట్టిన సమ్మె రెండో రోజైన మంగళవారం కొనసాగింది. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో జూడాలు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు నేతృత్వంలో ఆస్పత్రి పాలనాయంత్రాంగం రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. పలుమార్లు వైద్య ఉన్నతాధికారులు, ప్రభుత్వంతో జరిపిన చర్చలు కొంతమేర మాత్రమే సఫలం అయ్యావని తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించకుంటే అత్యవసర, ఐసీయూ సేవలను కూడా నిలిపివేస్తామన్నారు.

డీజిల్ ట్యాంకర్ బోల్తా.. తప్పిన ప్రాణాపాయం

తిమ్మాయిపల్లి ఫారెస్ట్ రిడ్జ్ సమీపంలో ఘటన

కీసర: డీజిల్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కీసర పోలీసుల వివరాల ప్రకారం... ఘట్‌కేసర్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ కంపెనీ నుంచి మూడు కంపార్ట్‌మెంట్లు గల డీజిల్ ట్యాంకర్ 12 వేల లీటర్ల పెట్రోల్ లోడ్‌తో కీసర మీదుగా మంగళవారం ఉదయం శామీర్‌పేటకు వెళ్తోంది. తిమ్మాయిపల్లి దాటిన తరువాత ఫారెస్ట్ రిడ్జ్ సమీపంలోని మూలమలుపు వద్ద ట్యాంకర్ ఒక్కసారిగా రోడ్డు కిందికి దిగి బోల్తా పడింది. కొంతమేర డీజిల్, పెట్రోల్ లీకవుతుండటంతో అటుగా వెళ్తున్న వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కీసర పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ప్రమాద నివారణకుగాను ముందుజాగ్రత్తగా ట్రాఫిక్ మళ్లించారు. జేసీబీతో చెట్లపొదలను తొలగించి, క్రేన్ ద్వారా ట్యాంకర్‌ను అతికష్టం మీద బయటకు తీశారు. మరమ్మతులు చేసిన తర్వాత ట్యాంకర్‌ను అక్కడి నుంచి తరలించారు. పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో వాహనదారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.